JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 324 13 సోమవారం జూలై 2026 ఎడిటర్ గుంటపల్లి స్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

# కలిసికట్టుగా ముందుకు సాగుదాం..

జనసైన్యం సిటి

జగిత్యాల జిల్లా అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పని చేస్తూ జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జగిత్యాల జిల్లా చెల్ గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు నిజామాబాద్ ఎంపీ అరవింద్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి చల్ గల్ వాలంతరి భూములు కేటాయించడం ఒక సవాలుగా మారిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని ఒప్పించి క్యాబినెట్లో తీర్మానం చేసి ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్లు మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి భూమి కేటాయించినందుకు ముఖ్యమంత్రి



మంత్రి లక్ష్మణ్ కుమార్..

గారితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి గారికి మంత్రి లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడం సంతోషమని మంత్రి తెలిపారు. పార్టీలకు అతీతంగా జగిత్యాల అభివృద్ధి లో ప్రతి ఒక్కరు కలిసి రావాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. సంక్షేమ శాఖ మంత్రిగా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో కేంద్రీయ విద్యాలయానికి భూమి కేటాయించినందుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల కేంద్రీయ విద్యాలయంలో 50 శాతం సీట్లు స్థానికులకు 50 శాతం సీట్లు త్రివిధ దళాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తామని ఎంపీ తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కొరకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకువస్తూ దేశానికి తెలంగాణ రోల్డ్ మోడల్ అయ్యే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చర్యలు తీసుకుంటున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాష్ట్రంలో విద్యకు ప్రథమ ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి గారు ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే సత్యం తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ చల్ గల్ లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని భావించి ఇక్కడ స్థలం కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ సారించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు.

# మూర్ఖంగా మాట్లాడిన ముఖ్యమంత్రిని మేమెప్పుడూ చూడలేదు

జనసైన్యం సిటి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేయడం ఒక్కటే మార్గమని నాయకుడు పేర్కొన్నారు.కన్నెపల్లి మోటార్లను వెంటనే ఆన్ చేసి నీటిని విడుదల చేయాలని కోరుతూ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం, ముఖ్యంగా రిటైర్డ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు.ఈ లేఖ రాసినందుకు గానూ తెలంగాణ మేధావులను, రిటైర్డ్ ఇంజనీర్లను జైల్లో పెట్టాలని, వారిని బొక్కలో వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడంపై నాయకుడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దశాబ్దాల కాలంగా ఇరిగేషన్ శాఖలో పనిచేసి, రాష్ట్ర పరిస్థితులపై అవగాహన ఉన్న రిటైర్డ్ ఇంజనీర్లు రైతుల పక్షాన ఇచ్చిన మంచి సలహాలను ప్రభుత్వం సానుకూలంగా తీసుకోలేదని విమర్శించారు. ఒక బాధ్యత గల ప్రభుత్వం అయితే నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యమా కాదా అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలి లేదా సంబంధిత అధికారులతో మాట్లాడించాలి, కానీ దాన్ని వదిలేసి సలహాలు ఇచ్చిన వారిపై ఇష్టానుసారంగా మాట్లాడడం ముఖ్యమంత్రి అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు.నదిలో దాదాపు 98 టీఎంసీల నీరు వృథాగా కొట్టుకుపోతోందని, ఆ రోజు తాము స్పష్టంగా చెప్పినట్లుగా మేడిగడ్డ దగ్గర గేట్లు వేయకుండా, నీటిని ఆపకుండానే అక్కడ నుండి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి పంప్‌హౌస్ నుండి నీటిని పంప్ చేయవచ్చని నాయకుడు వివరించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, పనికిరాదని, లక్ష కోట్లు



మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మునిగిపోయాయని ఈ ప్రభుత్వం ప్రచారం చేసిందని; ఇప్పుడు అదే ప్రాజెక్టు ద్వారా నీటిని లిఫ్ట్ చేస్తే తాము చెప్పినవన్నీ అబద్ధాలని తేలిపోతుందనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఇష్టపడడం లేదని ఆరోపించారు.ముఖ్యమంత్రి ఇష్టాయిష్టాల కంటే రైతుల పరిస్థితి ముఖ్యమని, పంటలు వేయాలో వద్దో తెలియక, దిక్కుతోచని స్థితిలో రైతాంగం ఆలోచిస్తోందని, వారికి ఉపశమనం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 7 జిల్లాల్లోని దాదాపు 40 లక్షల ఎకరాలకు నీరందించాలనే ముందుచూపుతో, కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకే కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీని నిర్మించారని, అక్కడ గోదావరి మరియు ప్రాణహిత నదులు కలుస్తాయి కాబట్టి ఎల్లప్పుడూ పుష్కలంగా నీరు అందుబాటులో ఉంటుందని గుర్తుచేశారు.N D S A (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) రిపోర్టు ప్రకారం దీన్ని రిపేర్ చేయవచ్చని, అసెంబ్లీలో కూడా హరీష్ రావు , కేటీఆర్ దీనిపై అనేకసార్లు మాట్లాడారని తెలిపారు.మేడిగడ్డ బ్యారేజీలో కుంగింది ఒకే ఒక పిల్లర్ అని, దానికి సంబంధించిన 7వ బ్లాక్ మొత్తాన్ని తీసేసి పునర్నిర్మించినా రూ. 300 నుండి రూ. 400 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని; ఆ నిర్మాణాన్ని చేపట్టిన L & T సంస్థే ఉచితంగా రిపేర్ చేయడానికి ముందుకు వచ్చి ముఖ్యమంత్రికి చెప్పినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నాయకుడు విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలోని రైతులు ప్రస్తుతం చాలా ఆవేదనతో మరియు ఇబ్బందులతో ఉన్నారని నాయకుడు తెలిపారు.ప్రస్తుత ముఖ్యమంత్రికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదని విమర్శించారు. కేసీఆర్ గారి నాయకత్వంలో ఇరిగేషన్ ఇంజనీర్లు, జర్నలిస్టులు మరియు అనేక మంది శక్తులు కలిసి పోరాడితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కానీ నేడు వారిని కనీసం గౌరవించే సంస్కృతి ఈ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు.ప్రెస్ మీట్ లో ఒక జర్నలిస్ట్ "పంటలకు నీళ్లు ఎప్పుడు ఇస్తారు?" అని ప్రశ్నిస్తే... "వాళ్లను కోసి రక్తం చల్లితే పంటలు పండుతాయి" అనేలా ముఖ్యమంత్రి మాట్లాడారని, ఇంత తర్కశూన్యంగా, మూర్ఖంగా మరియు దుర్మార్గంగా మాట్లాడిన ముఖ్యమంత్రిని తామెప్పుడూ చూడలేదని నాయకుడు తీవ్రంగా విమర్శించారు.ఈ ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి వెంట మాజీ మేయర్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, ముత్యాల బలరాం రెడ్డి, ఏలేటి కృష్ణ రెడ్డి ఉన్నారు .



## ఆనందంకు జన్మదిన శుభాకాంక్షలు



## రవికి జన్మదిన శుభాకాంక్షలు



# నకిలీ దత్తత రికార్డులు, అక్రమ ఎస్సీ సర్టిఫికేట్‌తో ప్రభుత్వ ఉద్యోగం

## బండి శ్రీనివాస్ శ్రీసన్



**జనసైన్యం సిటి**
తప్పుడు దత్తత రికార్డులు, నకిలీ ఎస్సీ కుల సర్టిఫికేట్‌తో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వూట్ల కృష్ణ అలియాస్ యేషయ్యపై క్రిమినల్ చర్యలు తీసుకుని, అతని నియామకాన్ని రద్దు చేయాలని భారతీయ నవజీవన్ పార్టీ (దీచీజీ) జాతీయ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ శ్రీసన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్రమాలపై పూర్తి ఆధారాలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్‌కు ఆయన స్వయంగా సమర్పించారు. గతంలో కరీంనగర్ ఉమ్మడి మండలంలో నియామకం జరిగి ప్రస్తుతము తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ జీపీఓ గా పని చేస్తున్నాడు కరీంనగర్ ఉమ్మడి మండలం పరిధిలో జరిగిన ఈ నియామకం ప్రభుత్వ నిబంధనలను, హిందూ దత్తత చట్టాన్ని మరియు భారత రాజ్యాంగాన్ని పూర్తిగా పరిహసించేలా ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కారుణ్య నియామకాలకు వర్తించే జీవో నెం. 612 ప్రకారం దత్తత అనేది ప్రభుత్వ ఉద్యోగి మరణానికి కనీసం ఐదేళ్ల ముందే జరిగి ఉండాలనే నిబంధనను సదరు వ్యక్తి పూర్తిగా ఉల్లంఘించారని, చల్లాపూర్ జెడ్పీ హై స్కూల్ రికార్డుల ప్రకారం ఆయన సృష్టించిన 1977 నాటి దత్తత క్లెయిమ్ ముమ్మాటికీ ఫోర్జరీ అని బండి శ్రీనివాస్ శ్రీసన్ స్పష్టం చేశారు.

?సదరు నిందితుడు 1997లోనే క్రైస్తవ పద్ధతిలో వివాహం చేసుకున్నారని, హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం (నాూహీూ 1956) సెక్షన్ 10 ప్రకారం 15 ఏళ్లు దాటిన వారికి లేదా వివాహమైన వారికి దత్తత తీసుకునే చట్టబద్ధమైన హక్కు ఏ ఒక్కరికీ లేదని ఆయన వివరించారు. అందువల్ల 1998 మరియు 2006 లలో సృష్టించబడిన దత్తత పత్రాలు చట్టం దృష్టిలో అసలు చెల్లవని పేర్కొన్నారు. దీనికంటే ఘోరమైన విషయం ఏమిటంటే, సదరు వ్యక్తి క్రైస్తవ మతంలో కొనసాగుతూ, నిజాన్ని దాచిపెట్టి, అక్రమంగా ఎస్సీ మాదిగ కుల ధృవీకరణ పత్రాన్ని పొంది రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇది నిజమైన ఎస్సీ నిరుద్యోగుల హక్కులను, అవకాశాలను దారుణంగా దొంగిలించడమేనని బండి శ్రీనివాస్ శ్రీసన్ ఆవేదన వ్యక్తం చేశారు.

?ఈ సుదీర్ఘ కుంభకోణంపై జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించి వూట్ల కృష్ణ నియామక ఉత్తర్వులను రద్దు చేయాలని, ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసినందుకు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, 2007 నుండి ఇప్పటివరకు ప్రభుత్వ సొమ్ము రూపంలో ఆయన పొందిన జీతభత్యాలు, అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం తక్షణమే రికవరీ చేయాలని కోరారు. ఈ చట్టవిరుద్ధ నియామకానికి సంబంధించిన పాఠశాల ధృవీకరణ పత్రాలు, వివాహ పత్రాల నకళ్లను కలెక్టర్ కార్యాలయానికి సమర్పించినట్లు , ఈ విషయం గురించి అడిగితే తప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆయన అన్నారు ఈ విషయమై పలువురు వ్యక్తులు గతంలోనే జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లినట్లు దాని గురించి కూడా ఎంక్వయిరీ కి ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు

# జగన్నాథ రథయాత్రను విజయవంతం చేద్దాం, ఇస్కాన్ మందిర నిర్మాణం చేపడదాం



**జనసైన్యం సిటి**
16 జూలై 2026 రోజు మహాలక్ష్మీ దేవాలయం నుంచి వైశ్యాభవన్ వరకు పెద్దఎత్తున చేపడుతున్న జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయడంలో కరీంనగర్ భక్తకోటి స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఈ రోజు జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రతి ఏటా రథోత్సవం భారీ భక్తుల మధ్య కరీంనగర్ పురవీధుల్లో జరగడం సంతోషదాయకమని అభిప్రాయపడ్డారు. మన కరీంనగర్ పట్టణ ముఖద్వారమైన సిరిసిల్లా బైపాస్ రోడ్డులో ఇస్కాన్ రాధా గోవింద మందిరానికి మూడు ఎకరాల స్థలం కేటాయించడం, అందులో త్వరలో ఇస్కాన్ దేవాలయం నిర్మాణం పనులు ప్రారంభించాలని అన్నారు. కరీంనగర్ పట్టణానికి ప్రధాన ఆకర్షణగా నిలిచే ఇస్కాన్ మందిరం సమీప భవిష్యత్తులో కార్యరూపం దాల్చడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇస్కాన్ మందిరంలో కొలువైన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర తోబుట్టువులకు నిత్యం ఎనిమిది సార్లు ప్రత్యేక హారతి పూజలు నిర్వహించడం హర్షణీయం, ప్రజలకు శుభకరం కాగలదని అన్నారు. మధ్యాహ్న హారతి కార్యక్రమంలో పాల్గొన్న గంగుల కమలాకర్ స్వామి వారి దీవెనలు పొంది ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు రథయాత్ర ఏర్పాట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్ హరిశంకర్, గుగ్గిళ్ల జయశ్రీ, గుగ్గిళ్ల శ్రీనివాస్‌లతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, రాళ్లబండి గోపాల్ రెడ్డి, ఒజగన్నాథుడి భక్త బృందం పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందుతుడు అరెస్ట్, రిమాండ్ కి తరలింపు



**జనసైన్యం సిటి**
సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ... పుప్పాల శ్రీకాంత్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండటంతో, సుమారు ఆరు సంవత్సరాల క్రితం అతని భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అతడిని విడిచి వెళ్లిపోయింది.

అప్పటి నుంచి శ్రీకాంత్ తన తల్లితో కలిసి సిరిసిల్లలోని బి.వై. నగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తూ, మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వాలని ఆమెను తరచూ వేధించేవాడు. సుమారు ఐదు నెలల క్రితం అతని తల్లి తన సోదరుడు రాగుల ఎల్లయ్య ఇంటికి వెళ్లగా, అక్కడికి చేరుకున్న శ్రీకాంత్ డబ్బులు ఇవ్వాలని తన తల్లిని అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవకు దిగాడు.దీనిని గమనించిన రాగుల ఎల్లయ్య, తల్లిని ఎందుకు వేధిస్తున్నావని శ్రీకాంత్‌ను అందరి సమక్షంలో తీవ్రంగా మందలించి, కర్రతో కొట్టి, అసభ్య పదజాలంతో తిట్టాడు. ఈ సంఘటనను శ్రీకాంత్ తీవ్ర అవమానంగా భావించి, తన మేనమామ రాగుల ఎల్లయ్యపై తీవ్ర కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతన్ని హత్య చేసి, తనను చూసి అందరూ భయపడేలా చేయాలని, అలాగే తన జల్సాలకు డబ్బులు అడిగినప్పుడల్లా ఇస్తారని భావించాడు.అంతేకాకుండా, రాగుల ఎల్లయ్యకు భార్య, పిల్లలు లేరనే విషయాన్ని ఆసరాగా తీసుకొని, అతన్ని హత్య చేస్తే అతని ఇల్లు తనకు దక్కుతుందని కూడా పథకం వేసుకున్నాడు. అనంతరం సుమారు నాలుగు నెలల క్రితం శ్రీకాంత్ తల్లి మరణించడంతో, తన ఖర్చులకు డబ్బులు ఇచ్చే వారు ఎవరూ లేకపోవడంతో, మేనమామను హత్య చేసి ఆయన ఇంటిని స్వాధీనం చేసుకుని,ఆ ఇంటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు.తేదీ 04-07-2026న సిరిసిల్ల మార్కెట్‌లో తన మేనమామ రాగుల ఎల్లయ్యను చూసిన నిందితుడు పుప్పాల శ్రీకాంత్, ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అతడిని పెద్దూరు శివారుకు తీసుకెళ్లి కల్లు, మద్యం తాగించాడు. బాధితుడు మత్తులోకి వెళ్లిన తర్వాత గొంతు నులిమి హత్య చేయడానికి ప్రయత్నించగా ప్రతిఘటించడంతో, సమీపంలో ఉన్న బండరాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం శవాన్ని పాత బట్టలతో కప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.మరుసటి రోజు నిందితుని పెద్దమ్మ బిడ్డ అయిన రాగుల శారద,రాగుల ఎల్లయ్య కన్పించకుండా పోయాడని, సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు పెట్టిందని తెలుసుకొని హైదరాబాద్‌కు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, సిరిసిల్ల ఎల్లమ్మ చౌక్ వద్ద పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సి.ఐ తెలిపారు.

# పో.క్సో కేసులో రూ.20 లక్షల డీల్..?





**జనసైన్యం సిటి**

షాబాద్‌లో ఆరుగురిని హ..త్య చేసిన రాజ్‌కుమార్ పో.క్సో కేసులో బిగ్ ట్విస్ట్! బాధిత బాలిక కుటుంబం తనపై పెట్టిన పో.క్సో కేసులో అరెస్ట్ అవ్వకుండా ఉండేందుకు.. రాజ్‌కుమార్ అక్షరాల రూ. 20 లక్షలు ఇచ్చాడని సమాచారం! అంత భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చాడు కాబట్టే.. పో.క్సో కేసులో కఠినమైన సెక్షన్లు పెట్టకుండా, స్టేషన్ బెయిల్ వచ్చే బలహీన సెక్షన్లు పెట్టినట్లు వార్తలు. పోలీసుల చేతికి డబ్బులు ముట్టడం వల్లే.. రాజ్‌కుమార్ బె..దిరిం.పులకు పాల్పడుతున్నాడని బాధితులు ఫిర్యాదు చేసినా వాళ్ళు పట్టించుకోలేదని ఆరోపణ. ఈ నేపథ్యంలోనే.. అంతర్గత విచారణ జరిపి, ఒక్కొక్క అధికారిపై ఉన్నతాధికారులు వేటు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎస్సై రమేష్‌ను సస్పెండ్ చేయగా.. ఇప్పుడు సీఐ క్రాంతి రెడ్డిని సస్పెండ్ చేస్తూ సీపీ తరుణ్ జోషి ఆదేశం.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భగత్ చంద్ర



**జనసైన్యం సిటి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామానికి చెందిన జస భగత్ చంద్ర తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆదివారం ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇలెందుల ప్రభాకర్ తెలిపారు. భగత్ చంద్ర జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ పోటీలు కోరుట్ల కాలేజీ గ్రౌండ్స్ లో నిర్వహించారు. జగిత్యాల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి భగత్ చంద్ర 3 వేల మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించి బంగారు పథకాన్ని గెలుచుకున్నారు.ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన శివ సాయి 3 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్య పథకాన్ని సాధించారు. భగత్ చంద్ర మెదక్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరఫున పాల్గొననున్నారు.ఈ సందర్భంగా పిడి అనూషను, విద్యార్థులను ప్రిన్సిపల్ ఇల్లెందుల ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు నరేష్, రాజేందర్, మహేష్, ఉజ్వల, శ్రీనివాస్, రాము తదితరులు విద్యార్థులను అభినందించారు.

# సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన వైద్యుల అంజన్ కుమార్



**జనసైన్యం సిటి**

పలు ఆరోగ్య సమస్యల నిమిత్తం స్థానిక వెంకటేష్ చికిత్స చేయించుకుని ఆర్థిక సహాయార్థం సీఎం సహాయ నిధి కొరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని ఆశ్రయించారు.వారికి సీఎం రేవంత్ రెడ్డి నుండి సహాయం మంజూరుకాగా, రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ నేరుగా లబ్ధిదారులకు జవీఆర్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి, ఆదర్శ నగర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మెతుకు కనకయ్య, విజయలక్ష్మి, ఓ. మల్లయ్య, జగ్గారెడ్డి, గంధం లక్ష్మీనారాయణ, ఓ. రమణ, ఇట్టినేని శ్రీనివాస్, రాజ నరసయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికి, మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# దక్షిణ భారత గాన కోకిల : భావ వ్యక్తీకరణ - స్వర మార్పుల రాణి : జానకమ్మ

ఆచార్య : మధుసూధన్ రెడ్డి బుర్ర

(జూలై 11న ప్రముఖ దక్షిణ భారత గాయని ఎస్. జానకి ఆకస్మిక మరణం సందర్భంగా)



ప్రముఖ నేపథ్య గాయని, "దక్షిణ భారతదేశ గాన కోకిల (దక్షిణ నైటింగేల్)"గా పేరుగాంచిన ఎస్. జానకి, వయసు సంబంధిత అనారోగ్యాలకు చికిత్స పొందుతూ మైసూరులో 88 ఏళ్ల వయసులో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె భారతీయ చలనచిత్ర చరిత్రలోనే అత్యంత గొప్ప, ప్రభావవంతమైన గాయకులలో ఒకరు. "జానకమ్మ" అని ప్రేమగా పిలుచుకునే ఈ దిగ్గజ గాయని, ఈ గుర్తింపు చాలా ఆలస్యంగా వచ్చిందని చెబుతూ, 2013లో భారతదేశపు 3వ అత్యున్నత పౌర పురస్కారమైన "పద్మభూషణ్"ను తిరస్కరించారు, ఇది నిజమే కదా. జానకి తన 19వ ఏట, 1957లో తన అద్భుతమైన నేపథ్య గాన ప్రస్థానాన్ని ప్రారంభించి, భారతదేశపు అత్యంత ప్రసిద్ధ గాత్రాలలో ఒకటిగా ఎదిగారు. ఆమె తన కెరీర్ మొత్తంలో 20కి పైగా భాషలలో పాడారు. దురదృష్టవశాత్తు గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

**ప్రతిష్ఠాత్మక గౌరవాలు మరియు పురస్కారాలు:**

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 1938 ఏప్రిల్ 23న సిస్ల శ్రీరామమూర్తి జానకి జన్మించారు. ఆమె తన బాల్యంలో ఎక్కువ భాగం తెలంగాణలోని సిరిసిల్లలో గడిపారు. చిన్న వయసులోనే సంగీతాన్ని అభ్యసించడానికి ఆమె మద్రాసుకు తరలి వెళ్లారు. 1957లో 'విధియిన్ విలయాట్టు' అనే తమిళ చిత్రం ద్వారా ఆమె నేపథ్య గాయనిగా అరంగేట్రం చేశారు. 'ఎమ్మెల్యే' చిత్రంలో తన మొదటి తెలుగు పాటను పాడిన ఆమె, క్రమంగా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ఫలవంతమైన కెరీర్‌లలో ఎదిగారు. తన గాన ప్రస్థానంలో, ఆమె 20కి పైగా భారతీయ భాషలలో 50,000కు పైగా పాటలను రికార్డ్ చేసి, దేశంలోనే అత్యంత నిష్ణాతులైన నేపథ్య గాయకులలో ఒకరిగా నిలిచారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ, సంస్కృతం,



ఒడియా, తులు, ఉర్దూ, పంజాబీ, బెంగాలీ, బడగ, కొంకణి భాషలలో ఆమె పాడిన పాటలు భారతదేశ సంగీత వారసత్వంలో విడదీయరాని భాగంగా నిలిచాయి. అయితే, జానకి అత్యధిక పాటలను కన్నడలో, ఆ తర్వాత మలయాళ భాషలో పాడారు. ఆమె "భావ వ్యక్తీకరణ మరియు స్వర మార్పుల రాణి"గా విస్తృతంగా ప్రశంసలు అందుకున్నారు.

ఆమె ఇంగ్లీష్, జపనీస్, జర్మన్ మరియు సింహళ భాషలలో కూడా పాడారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన అపారమైన కృషికి గుర్తింపుగా, కర్ణాటక రాజ్యోత్సవ అవార్డు, తమిళనాడు నుండి కళైమామణి అవార్డు, కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డులు (11), తమిళ అవార్డులు (06), ఒరిస్సా రాష్ట్ర చలనచిత్ర అవార్డులు (1), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర అవార్డులు (10), సంగీత రంగంలో ఆమె చేసిన అసాధారణమైన కృషికి గుర్తింపుగా మైసూరు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్‌తో సహా 33 ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. 6 దశాబ్దాలకు పైగా సాగిన తన విశిష్ట నేపథ్య ప్రస్థానంలో, ఆమె 4 జాతీయ చలనచిత్ర అవార్డులను మరియు బహుళ భారతీయ భాషలలో అపూర్వమైన 33 రాష్ట్ర చలనచిత్ర అవార్డులను అందుకున్నారు.

**20కి పైగా భాషలు, 50,000లకు పైగా పాటలు:**

జానకమ్మ 20 భాషలలో వేలాది పాటలకు ప్రాణం పోశారు, లక్షలాది శ్రోతలకు ప్రేమ, విరహం, ఆరాటం, భక్తి మరియు ఆనందానికి సునాయాసంగా స్వరంగా మారారు. ఆమె అసాధారణమైన స్వర నియంత్రణ, భావోద్వేగ పరిజ్ఞానం మరియు తాను పాడిన ప్రతి పాటలో లీనమయ్యే సామర్థ్యంతో తన కెరీర్‌ను నిర్మించుకున్నారు. అది ఫ్లాష్‌బ్యాక్ జానపద గీతమైనా, శృంగార యుగళగీతమైనా, మృదువైన జోలపాట అయినా లేదా గాఢమైన భావోద్వేగ గీతమైనా, ఆమె స్వరంలో ఉన్న నిజాయితీ ప్రతి కూర్పును వ్యక్తిగతంగా అనిపించేలా చేసింది. ఆమె ఒక అమాయక చిన్నారి కోసం, 16 ఏళ్ల అమ్మాయి కోసం, మధ్య వయస్కురాలి భావాల కోసం, మరియు వృద్ధురాలి అలసట కోసం పాడారు. తెరపై పాత్ర యొక్క వయస్సు, వ్యక్తిత్వం మరియు భావోద్వేగ స్థితికి అనుగుణంగా తన స్వరాన్ని మార్చుకునే అరుదైన సామర్థ్యం ఆమెకు ఉంది. ఎం.ఎస్. విశ్వనాథన్, కె.వి. మహదేవన్, ఇళయరాజా, రాజన్-నాగేంద్ర, దేవరాజన్, జాన్సన్, హంసలేఖ మరియు ఏ.ఆర్. రెహమాన్ వంటి దిగ్గజ సంగీత దర్శకులతో ఆమె చేసిన సహకారాలు ఎంతో శాశ్వతమైన గీతాలను అందించాయి. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో ఆమె పాడిన లెక్కలేనన్ని యుగళగీతాలు కూడా అంతే చిరస్మరణీయమైనవి; దశాబ్దాల పాటు దక్షిణ భారత సినీ సంగీతానికి పర్యాయపదంగా నిలిచిన వారి భాగస్వామ్యం అది.

జానకమ్మ పాటలు రేడియోలు, టీవీలు, ప్లేలిస్టులు మరియు సంగీత కచేరీల ద్వారా ప్రసారమవుతూ, కొత్త శ్రోతలను ఆకట్టుకుంటూనే, ఆమె హృదయస్పర్శి సంగీతంతో పెరిగిన వారి హృదయాలను హత్తుకునేలా కొనసాగాయి. ఆమె మరణంతో, భారతీయ సినిమా ఒక దిగ్గజ నేపథ్య గాయనిని మాత్రమే కాకుండా అంతకంటే ఎంతో ఎక్కువ కోల్పోయింది. ఆమె 1959లో వి. రామప్రసాద్‌ను వివాహం చేసుకున్నారు మరియు వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె ఏకైక కుమారుడు, మురళీ కృష్ణ, ఈ సంవత్సరం ప్రారంభంలో 65 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఈ విషాదం ఆ దిగ్గజ గాయనిని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆ తర్వాత ఆమె తన వయసు సంబంధిత ఆరోగ్య సమస్యలతో పోరాడుతూ ప్రజా దృష్టి నుండి దూరమై, చివరకు 2026 జూలై 11న తుదిశ్వాస విడిచారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి..

**జనసైన్యం సిటి**



ధర్మపురి నియోజకవర్గ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామంలో కంకణాల వసంత - లక్ష్మణ్ దంపతు లకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర సాంఘిక మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. నూతన గృహప్రవేశం చేసిన దంపతులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. గొల్లపల్లి మండలం రంగధాముని పల్లి గ్రామానికి చెందిన పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు మహేందర్ తమ్ముడు మనోహర్ వివాహ విందు వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గొల్లపల్లి మండల కేంద్రంలో చెందిన కాంగ్రెస్ కార్యకర్త అవుల ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ప్రవీణ్ కు మెరుగైన వైద్యం అందించడానికి తన వంతుగా సహకరిస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## స్వర లయల విరామం అమర గాన ప్రయాణం





పాటల తోటలో కోకిల వాలింది
మధుర గానంతో మనుషులను
గెలిచింది ఈరోజు ఆ కోకిల
దూరంగా వెళ్ళింది సంగీత
లోకంలో చీకటి నిండింది
"ఝుమ్మంది నాదం "అంటూ
సాగిన నీస్వర ప్రవాహం
నేడు ముగిసిందా సంగీత
సామ్రాజ్య అధ్యాయం
"మౌనమే నీ భాష" అని
నువ్వు వెళ్ళిపోయినా
నీ పాటల తోటలో వసంతం
ఎప్పటికీ వాడిపోదు
స్వర కెమిస్ట్రీలో జానకమ్మ
అందెవేసిన చేయి
దైవ దత్త ప్రతిభతో సంగీత
సామ్రాజ్యాన్ని శాసించావు
గోరువంక వాలిందిగో" అని
నువ్వు పలికిన వేళ
తెలుగు గుండెల్లో కురిసింది
అమృతాల మాల
సువ్వి సువ్వమ్మ అంటూ లాలించి
నీ గొంతు ప్రతి అమ్మ లాలిపాటకు
అందించిందో కొత్త వంతు అమ్మ
లాలి పాటలో నీ ప్రేమను చూశాం
ప్రేమగీతాల్లో నీ స్వరం విన్నాం
గజ దొంగ చిత్రంలో నీ ఇళ్ళు
బంగారం కాను జగదేకవీరుడు
అతిలోక సుందరిలో అబ్బ
నీతీయని దెబ్బ లాంటి శృంగార
హాస్య భావాలను కేవలం
గొంతులో పలికించావు
ఏం ఎల్ ఏ (1957) తొలి
చిత్రంలో నీ ఆశ అడియాస
చేయిజారే మణిపూస విషాద
గీతంతో పాటల ప్రస్థానం
మొదలుపెట్టావు
వెన్నెల్లో గోదారి అందం
(సితార1984) పాటకు
జాతీయ స్థాయిలో ఉత్తమ
నేపథ్య గాయనీ అవార్డ్
అందుకున్నావు
నీ లీల పాడేద వేలా( మురిపించే
మువ్వలు) పాట ద్వారా
శాస్త్రీయ సంగీత నైపుణ్యాన్ని
నిరూపించావు మౌనమే
ప్రియముగా (మౌనపోరటం)
ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం
వహించి సంగీత ప్రపంచంలో
సరికొత్త సృజనకు మార్గదర్శివైనావు
50 వేలకు పైగా తెలుగు కన్నడ
తమిళ్ మలయాళం(చిత్రాల్లో)
భాషల్లో మెలోడీ క్లాసికల్
జానపద గీతాలుఆలపించారు
"సిరిమల్లె పువ్వా" అంటూ
విరహాన్ని పలికించావు
"ఆకాశంలో ఆశల హరివిల్లు"
ఎన్నో విరియించావు
"నీలి మేఘాలలో గాలి
కెరటాలలో" తేలిపోయావా
సంగీత లోకాన్ని తీరని శోకంలో
ముంచేసి వెళ్ళావా
"తెలి మంచు కరిగింది" కానీ
నీ జ్ఞాపకం కరగదు
కాలం ఎంత మారినా
నీగాన మధురిమ వీడదు
భౌతికంగా నువ్వు
మా నుండి దూరమైన
నీ ప్రతి పాటలో నువు
బతికే ఉన్నావు నీ గొంతు
ఆగినా సంగీత లోకంలో
నీ గానం చిరస్మరణీయం
నీవు భౌతికంగా దూరమైన
కోట్లాది స్వరాలై వెలుగుతావు
అమర గాయని ఎస్ జానకి
దివ్య స్మృతికి అక్షర నివాళులు
జానకి సంగీత ఆశయాలు
సాధించడానికి కృషి చేయడమే
మనం చెల్లించే నిజమై నివాళి




నేదునూరి కనకయ్య

## భూమి అద్భుతమైన చరిత్ర గుట్టు విప్పుతున్న శిలలు

**(జూలై 13న "అంతర్జాతీయ శిలా దినోత్సవం" సందర్భంగా)**

**ఆచార్య : మధుసూధన్ రెడ్డి బుర్ర**





రాక్స్ లేదా రాళ్ళు కేవలం ప్రకృతి రమణీయ దృశ్యాల కన్నా చాలా ఎక్కువ. రాయి లేదా శిల అనేది ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఖనిజాల సహజసిద్ధమైన ఘన సముదాయం. భూమి బయటి ఘన పొర అయిన శిలావరణం, రాళ్ళతో తయారైంది. అనేక రాళ్ళలో సిలికా ఉంటుంది, ఇది సిలికాన్, ఆక్సిజన్‌ల సమ్మేళనం, ఇది భూమి యొక్క పై పొరలో 74 శాతం ఉంటుంది. శిలలు బిలియన్ల సంవత్సరాలుగా గ్రహం యొక్క చరిత్రను నమోదు చేస్తూ నాగరికతను నిర్మించే ఖనిజాలు, లోహాలను కలిగి ఉంటాయి. భవనాలు, రహదారుల నుండి మన జేబుల్లోని సాంకేతికత వరకు ప్రతిదానికీ ముడి పదార్థాలను అందిస్తాయి శిలలు. భూగర్భ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడం మనకు నీరు, వనరులను గుర్తించడానికి, భూకంపాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి వైపరీత్యాలను అంచనా వేయడానికి, సుదీర్ఘ కాలంలో భూమి ఎలా మారిందో గ్రహించడానికి శిలల అధ్యయనం సహాయపడుతుంది.

**భూవిజ్ఞాన శాస్త్రవేత్త యూజీన్ షూమేకర్ పుట్టినరోజు:**

ప్రతి సంవత్సరం జూలై 13న జరుపుకునే అంతర్జాతీయ శిలా దినోత్సవం (ఇంటర్నేషనల్ రాక్ డే), ఈ ప్రక్రియల గురించి మరింత లోతైన ఉత్సుకతను ప్రోత్సహిస్తూ భవిష్యత్ తరాల భూ శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిస్తుంది. ఈ రోజు మనకు వివిధ రకాల రాళ్ల గురించి మరింత తెలుసుకోవడానికి, మానవ చరిత్రలో రాళ్లు, ఖనిజాలు పోషించిన కీలక పాత్రను గుర్తించడానికి వీలు కల్పిస్తుంది. 13 జూలై రోజు జరుపుకునే అంతర్జాతీయ శిలా దినోత్సవం, 20వ శతాబ్దపు గ్రహ భూవిజ్ఞాన శాస్త్రంలో మార్గదర్శకులలో ఒకరైన, అత్యంత ప్రసిద్ధ భూవిజ్ఞాన శాస్త్రవేత్తలలో ఒకరైన "యూజీన్ షూమేకర్" పుట్టినరోజును సూచిస్తుంది. షూమేకర్ అపోలో వ్యోమగాములకు భూవిజ్ఞాన శాస్త్ర రంగంలో శిక్షణ ఇవ్వడంలో సహాయపడ్డారు. అంతర్జాతీయ శిలా దినోత్సవం అనేది రాళ్లు, ఖనిజాలు, భూవిజ్ఞాన శాస్త్రం యొక్క వార్షిక వేడుక. ఈ వేడుకలను జరుపుకుంటూ భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, భూవిజ్ఞాన శాస్త్ర సంఘాలు, మ్యూజియం నిర్వాహకులు, రాళ్ల సేకరణదారులు, ఆసక్తిగల కుటుంబాలు ఒకేలా ఆనందిస్తారు. వయస్సు లేదా నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ భూవిజ్ఞాన శాస్త్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం, ఆసక్తికరంగా మార్చడం దీని లక్ష్యం. ఈ రోజున మనం అరుదైన రాళ్లను సేకరించవచ్చు, రాళ్ల రకాల గురించి తెలుసుకోవచ్చు, భూవిజ్ఞాన శాస్త్ర మ్యూజియంను సందర్శించవచ్చు, శిలాజాల వేటకు వెళ్లవచ్చు, గైడెడ్ వాక్‌లో పాల్గొనవచ్చు, ప్రసిద్ధ శిలా నిర్మాణాలను అన్వేషించవచ్చు.

**గ్రానైట్ పరిశ్రమలతో పర్యావరణ విధ్వంసం నిజమేనా !**

గ్రానైట్ అనేది ప్రధానంగా క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, మైకాతో కూడిన ఒక అంతర్వేధ అగ్నిశిల. ఈ ఖనిజాలు గ్రానైట్‌కు దాని గరుకైన, స్ఫటికాకార రూపాన్ని ఇస్తాయి. వీటికి ఆకర్షణీయమైన తెలుపు, బూడిద రంగుల నుండి గులాబీ, ఎరుపు రంగుల వరకు ప్రత్యేకమైన రంగులను కలిగి ఉంటూ అందంగా కనిపిస్తాయి. గ్రానైట్ పరిశ్రమలో భారతదేశం ఒక ప్రపంచ శక్తి కేంద్రంగా ఉంది, ఏటా లక్షల టన్నుల గ్రానైట్‌ను ఉత్పత్తి చేస్తూ, 100కు పైగా రకాల్లో విస్తారమైన నిల్వలను కలిగి ఉంది. దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యంలో ఆధిపత్యం చెలాయిస్తున్న గ్రానైట్ పరిశ్రమలు రాజస్థాన్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులలో ప్రధాన ఉత్పాదక కేంద్రాలతో, ఏటా 5 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి ఆదాయాన్ని ఆర్జిస్తుంది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, అనంతగిరి అనేవి గ్రానైట్ పరిశ్రమల కేంద్రాలుగా గ్రానైట్ రాళ్లను వెలికితీసి, శుద్ధి చేసే ప్రముఖ ప్రదేశాలుగా గుర్తించబడ్డాయి. గ్రానైట్ పరిశ్రమ స్థానిక పర్యావరణంతో పాటు చుట్టుపక్కల సమాజాలపై అనేక విభిన్న మార్గాల్లో ప్రతికూల ప్రభావం చూపుతుంది. గ్రానైట్ వెలికితీత, శుద్ధి ప్రక్రియల వల్ల ఆవాసాల విధ్వంసం, అధిక నీటి వినియోగం, చుట్టుపక్కల ప్రాంతాలలో వాయు కాలుష్యం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు దారితీసే విషపూరిత సిలికా అధికంగా ఉన్న ధూళి వాతావరణంలోకి విడుదల కావడం, భారీ పరిమాణంలో ద్రవ బురద వ్యర్థాలు ఏర్పడటం, కొండచరియలు విరిగిపడే సమస్యలు, వృక్ష సంపద నష్టం, వన్యప్రాణుల ఆవాసాల ద్వారా జీవవైవిధ్య నష్టం, నేల కోత కారణంగా వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం, పేలుళ్ల వల్ల ధ్వని కాలుష్యం, భారీ యంత్రాలు - పేలుళ్ల వలన భూ ప్రకంపనలు, గ్లోబల్ వార్మింగ్‌కు దారితీసే గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలకు కారణమయ్యే అధిక శిలాజ ఇంధన శక్తి వినియోగం, నలగగొట్టడం మరియు డ్రిల్లింగ్ వల్ల ధూళి కాలుష్యం వల్ల దృశ్యమానత తగ్గడం, కార్మికులు మరియు స్థానిక సమాజాలలో వినికిడి లోపం వంటి అనేక విధాలుగా పర్యావరణంపై తీవ్ర ప్రభావాలు గ్రానైట్ పరిశ్రమలు చూపుతున్నాయి.

అగ్నిశిలలు, స్థిర శిలలు, రూపాంతర శిలలు అనే మూడు రకాల ప్రాథమిక శిలలు ఉన్నాయి. రాతియుగం నుండి రాళ్లను పనిముట్లుగా ఉపయోగిస్తున్నారు, అందువల్ల ఇవి మానవ చరిత్రలోని అత్యంత పురాతన సాంకేతిక పరిజ్ఞానాలలో ఒకటిగా నిలిచాయి. భూమిపై మనకు తెలిసిన అత్యంత పురాతన శిలలు బిలియన్ల సంవత్సరాల పురాతనమైనవి, ఇవి శాస్త్రవేత్తలకు గ్రహం యొక్క తొలి చరిత్రకు సంబంధించిన రికార్డును అందిస్తున్నాయి. అంతర్జాతీయ శిలా దినోత్సవాన్ని స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు అనుచరులతో పంచుకోవడం ద్వారా అవగాహన పెంచడంలో సహాయపడదాం. సోషల్ మీడియాలో చ×త్వతీఅఫ్ఐశీఖ్రీ=శీఏఙఖఎ2026 అనే హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించండి. మన గ్రహానికి రూపునిచ్చిన వివిధ రకాల శిలల వైవిధ్యభరితమైన నిర్మాణాలను అన్వేషించండి. శిలాశాస్త్రం (పెట్రాలజీ) యొక్క విజ్ఞానంలోకి ప్రవేశించండి, స్థానిక శిలా సేకరణ ప్రదేశాలను కనుగొనండి, భూమి యొక్క అద్భుతమైన చరిత్ర గురించి మరింత తెలుసుకోండి.

## కార్మికుల హక్కులు,చట్టాలను కాపాడేందుకు ఉద్యమిస్తోంది ఏఐటీయూసి.





దేశంలోని అన్ని రంగాల కార్మికులకు అండగా నిలుస్తూ,కార్మికవర్గ శ్రేయస్సు కోసం,వారి వేతనాల పెంపు హక్కులు,చట్టాలను కాపాడేందుకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుంది ఏఐటీయూసీ అనిఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు అన్నారు. గురువారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఏఐటీయూసీ కరీంనగర్ జిల్ల 5వ మహాసభ జిల్లా అధ్యక్షులుకటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ బాలరాజు మాట్లాడుతూ భారతదేశ కార్మిక సంఘాలలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఏఐటీయూసి ఉందని, కార్మిక వర్గాన్ని,ఉద్యోగ వర్గాన్ని ఐక్యం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదని,సంఘటిత అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక వర్గానికి ఆశాజ్యోతి గా నిలిచిందని శ్రమకు తగ్గ ఫలితం కావాలని,పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎంతోమంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపి అనేక చట్టాలు తీసుకువచ్చిన కార్మిక సంఘమని,చట్టాలు, హక్కులను కూడా కాపాడిన సంఘం ఏఐటీయూసి అన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను,చివరికి సమ్మె చేసే హక్కును కూడా కాలరాయడానికి బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల, కర్షకుల వ్యతిరేకిగా కేంద్ర ప్రభుత్వం ఉందని,ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సంస్కరణల పేరుతో రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా చేసి కార్మికులకు తీరని అన్యాయం మోడీ చేశాడని ఎస్ బాలరాజు విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామలలో ఉన్న కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి కార్మిక హక్కుల కోసం ఉద్యమాలకు సిద్ధం చేయాలన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కనీస వేతనాలు అమలు కోసం అలుపెరుగని ఉద్యమాలు చేయాలన్నారు. సెప్టెంబర్ 6 7 8 తేదీల్లో జరిగే నాలుగవ రాష్ట్ర మహాసభల్లో జిల్లాలోని కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ ఐదవ మహాసభల్లో ఏఐటియుసి కరీంనగర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు



కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు కాసెట్టి లక్ష్మయ్య ఉపాధ్యక్షులు తిరుపతి, యాదవ్ ,కార్యదర్శి పిట్టల సమ్మయ్య, డి రజిత, పిట్టల శ్రీనివాస్, కే రజిత, స్రవంతి ,ప్రభాకర్ కిమ్మసారపు నరసయ్య , ఏసు రజిత, లక్ష్మి, ఆగయ్య,,ఏం కొమురయ్య, రాజు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ఎర్రోజు అభినాష్ 15వ వర్ధంతి సందర్భంగా నివాళులు





తెలంగాణ చౌక్. లో తెలంగాణ రాష్ట్రం కోసం అమరుడైన రోజు ఎర్రోజు అభినాష్ 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్ లో వర్ధంతి వేడుకను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు హాజరై ఘనంగా నిర్వహించారు.... ముందుగా పేద ప్రజలకు దుప్పట్లు. పండ్లు పంపిణీ. బిస్కెట్ ప్యాకెట్లపంపిణీ. చేయడం జరిగింది.......ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ తెలంగాణ జీఎస్ ఆనంద్ మాట్లాడుతూ... ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు గౌరవముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కమిటీని వేయడం సంతోషిస్తున్నాం. ఆనాటి తొలి దశ ఉద్యమకారులకు మరియు మలిదశ ఉద్యమకారులకు న్యాయం చేసేలా ప్రభుత్వం ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం అని... ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలైన 250 చదరపు గజాల స్థలం. 25 వేల పెన్షన్. లతోపాటు గుర్తింపు కార్డులు. హెల్త్ కార్డు. అదేవిధంగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తూ ఉద్యమకారులందరి కి న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి. విజ్ఞప్తి చేస్తున్నాం.....ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు బొల్లం లింగమూర్తి. గొడిశాల రమేష్ గౌడ్. పెద్దపల్లి మధుసూదన్. తుల సంజీవరావు. మడుపు ప్రసాద్. గంగిపల్లి సతీష్. మందవెంకన్న గౌడ్. మధునయ్య. శ్రీధర్. వీరితోపాటు మహిళలు పాల్గొన్నారు..

# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త




బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన

ఫోన్ నెంబర్

9246966660

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు








మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

# రన్నింగ్ కాలమ్

తెలుగు పాటలకు
ప్రాణం పోసిన గానం
విభిన్న గొంతుకలతో
తనది ప్రత్యేక స్థానం

పద్నాలుగు భాషల్లో
పాడిన కళాసరస్వతి
జానకమ్మ ఆత్మకు
కలుగుగాక సద్గతి



-పెనుగొండ
బసవేశ్వర్..

## కరీంనగర్ జిల్లాలో విచ్చలవిడిగా అక్రమ దందా..!



**జనసైన్యం సిటి**

కరీంనగర్ (D)లో ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. ప్రతిరోజూ ఎక్కడో ఓచోట టాస్క్ ఫోర్స్ దాడుల్లో దంపులు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇసుకాసురులపై CP గౌస్ ఆలం ఉక్కుపాదం మోపుతుండడంతో ఇసుక అక్రమ రవాణాపై ఆయా PSలలో కేసులు నమోదవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల నుంచి ఒత్తిడి ఉన్నప్పటికీ CP దాడులను కొనసాగిస్తున్నారు. ఇక్కడికి బాగానే ఉన్నా దాడులతో ఇసుక ధరలు భారీగా పెరిగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## సిరిసిల్లలో 'దరిద్ర దేవత'ను తరిమికొట్టే వినూత్న సంప్రదాయం



**జనసైన్యం సిటి**

సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో ఆదివారం జెట్టక్క (దరిద్ర దేవత)ను తరిమికొట్టే సంప్రదాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కుల సంఘాల నిర్ణయం మేరకు దీనిని చేపట్టారు. ఇళ్లలోని పాత వస్తువులు, చీపుర్లను డప్పు చప్పుళ్లతో గ్రామ శివారులో పారేయడం ద్వారా దరిద్రం పోయి, లక్ష్మీదేవి అనుగ్రహంతో పంటలు బాగా పండుతాయని స్థానికులు నమ్ముతారు. ఈ వేడుకలో మార్కెట్ కమిటీ ఛైర్మన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షం కోసం వేడుకోలు.. వినూత్నంగా మొక్కులు!




వర్షాల కోసం ప్రజలు వినూత్న ఆచారాలతో దేవుడిని ప్రార్థిస్తున్నారు. ములుగు కొత్తూరులో దేవుని గుట్టపై ప్రత్యేక పూజలు చేసి 'వరద పాశం' నాకుతూ మొక్కు చెల్లించుకున్నారు. మరోవైపు సిరిసిల్ల (జి) రుద్రంగిలో 'దరిద్ర దేవత'ను తరిమికొట్టే సంప్రదాయాన్ని నిర్వహించి పాత వస్తువులను ఊరి బయట పడేశారు. గద్వాలలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మహానందిలో కప్పల ఊరేగింపు, కృష్ణా జిల్లాలో గంగమ్మకి కలశాభిషేకం చేశారు.


## విడిపోదామని వచ్చి.. ఒక్కటయ్యారు



**జనసైన్యం సిటి**

పదేళ్ల సంసారంలో చిన్న గొడవలతో విడాకుల కోసం పుత్తూరు (చిత్తూరు) కోర్టుకు వచ్చిన ఆ దంపతులను లోక్ అదాలత్ ఒక్కటి చేసింది. ఇద్దరు పిల్లల భవిష్యత్తును గుర్తు చేస్తూ అధికారులు ఇచ్చిన కౌన్సెలింగ్ వారి మనసులను మార్చింది. మనస్పర్థలను వదిలేసి ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమను గుర్తించారు. కన్నీళ్లతో వచ్చిన ఆ భార్యాభర్తలు చిరునవ్వుతో కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. విడిపోవాల్సిన వారు మళ్లీ ఒక్కటయ్యారు.

## బాతులు.. ఎంత బాగుందో



**జనసైన్యం సిటి**

కేరళంలోని త్రిసూర్ జల వనరులు ప్రకృతి ప్రేమికులకు కొత్త లోకాన్ని పరిచయం చేస్తున్నాయి. ప్రశాంతమైన నీటిపై బాతుల గుంపులు హాయిగా ఈదుతూ వెళ్తున్న దృశ్యం ఆకట్టుకుంటోంది. దీనికి సంబంధించిన పాత డ్రోన్ వీడియో తాజాగా వైరల్ అవుతోంది. కేరళం పర్యాటకంలో త్రిసూర్ ప్రకృతి సౌందర్యం అలరిస్తోంది. నిశ్శబ్దమైన వాతావరణం, పచ్చని పరిసరాలు పర్యాటకులకు గొప్ప అనుభూతినిస్తాయి. ఇలాంటి దృశ్యాలు తరచూ అక్కడ దర్శనమిస్తుంటాయి.

## రేపాక గ్రామములో ఘనంగా పోచమ్మ బోనాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలములోని రేపాక గ్రామములో ముతాటీ రోండ్ల సంఘం అధ్యక్షుడు రోండ్ల రామలింగారెడ్డి వారి ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు తీయుట జరిగింది. వారు మాట్లాడుతూ కాలం కాక వర్షాలు కురవక పంటలు సాగు చేయడం రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఆ పోచమ్మ తల్లి కరుణించి వర్షాలు సకాలంలో కురిసి రైతులకు మంచి రోజులు రావాలని ప్రత్యేక పూజల మొక్కలు చెల్లించుకున్న మణి రోండ్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు ఈకార్యక్రమంలో కుల సంఘం సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





సంపత్‌కు జన్మదిన శుభాకాంక్షలు



సూరికి జన్మదిన శుభాకాంక్షలు



హారిక కు జన్మదిన శుభాకాంక్షలు

# ఉగ్రవాదం - ఓ ఊసరవెల్లిని... గర్తించి, నిర్మూలించటమే ఛాలెంజ్



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద ఘటనలు తగ్గుతున్నాయనే గణాంకాలు మొదటి చూపులో ఆశాజనకంగా కనిపిస్తాయి. కొన్ని అంతర్జాతీయ నివేదికలు గత దశాబ్దంతో పోలిస్తే అనేక ప్రాంతాల్లో దాడుల సంఖ్య, మరణాల సంఖ్య తగ్గినట్లు సూచిస్తున్నాయి. అయితే గణాంకాల్లో కనిపించే ఈ తగ్గుదలనే వాస్తవ పరిస్థితిగా భావించడం ప్రమాదకరం. ఎందుకంటే ఉగ్రవాదం అనేది ఒక స్థిరమైన శత్రువు కాదు; కాలానికి అనుగుణంగా తన రూపాన్ని, వ్యూహాన్ని, లక్ష్యాన్ని మార్చుకుంటూ ముందుకు సాగే చలనశీలమైన ముప్పు. అందువల్ల కేవలం సంఖ్యల ఆధారంగా ప్రపంచం మరింత సురక్షితమైందని నిర్ణయించడం సరైన విశ్లేషణ కాదు.



గతంలో ఉగ్రవాద సంస్థలు పెద్దఎత్తున భూభాగాలను ఆక్రమించడం, ప్రత్యక్ష యుద్ధాలు చేయడం, భారీ పేలుళ్లకు పాల్పడటం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇచ్చేవి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. భౌగోళిక ఆధిపత్యం కంటే భావజాల వ్యాప్తి, చిన్న చిన్న స్వతంత్ర దాడులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆన్‌లైన్ నియామకం, డిజిటల్ ప్రచారం వంటి పద్ధతులు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. అందువల్ల దాడుల సంఖ్య తగ్గినా, వాటి ప్రభావం తగ్గిందని చెప్పలేం.

ప్రపంచ ఉగ్రవాద సూచీ (గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్) తాజా అంచనాల ప్రకారం, ఉగ్రవాదానికి సంబంధించిన భారం ఇప్పటికీ ప్రధానంగా సాహెల్ ప్రాంతం, సహారా దక్షిణ ఆఫ్రికా, పశ్చిమాసియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ వంటి ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉంది. ప్రపంచ ఉగ్రవాద మరణాల్లో గణనీయమైన భాగం ఈ ప్రాంతాల నుంచే నమోదవుతోంది. (లభ్యమైన తాజా అంతర్జాతీయ డేటా ఆధారంగా -- 2025 నివేదిక). అంటే సమస్య అంతరించిపోలేదు; కేవలం కేంద్రాలు మారాయి.

మరో ముఖ్యమైన పరిణామం “లోన్-వుల్ఫ్” దాడుల పెరుగుదల. ఒక పెద్ద ఉగ్రసంస్థకు ప్రత్యక్ష సంబంధం లేకుండానే, ఇంటర్నెట్ ద్వారా తీవ్రవాద భావజాలానికి ప్రభావితమై వ్యక్తిగతంగా దాడులు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. వీరిని ముందుగానే గుర్తించడం సంప్రదాయ నిఘా వ్యవస్థలకు చాలా కష్టం. ఫలితంగా పెద్ద కుట్రలను అడ్డుకోవడం కంటే చిన్న చిన్న దాడులను నిరోధించడం భద్రతా సంస్థలకు కొత్త సవాలుగా మారింది.

డిజిటల్ ప్రపంచం ఉగ్రవాదానికి కొత్త ఆయుధంగా మారింది. సామాజిక మాధ్యమాలు, గుప్త సందేశ వ్యవస్థలు, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వేదికలు, క్రిప్టోకరెన్సీల వినియోగం ద్వారా నియామకం, నిధుల సేకరణ, శిక్షణ, ప్రచారం మరింత సులభమయ్యాయి. ఒకప్పుడు శిక్షణ శిబిరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు ఒక మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు; తీవ్రవాద ప్రచారం ప్రపంచవ్యాప్తంగా క్షణాల్లో వ్యాపిస్తోంది.

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), డ్రోన్లు, స్వయంచాలక (ఆటోమాటిక్) సాంకేతికతలు కూడా కొత్త ప్రమాదాలకు దారితీస్తున్నాయి. తక్కువ ఖర్చుతో డ్రోన్లను పేలుడు పదార్థాల వాహకాలుగా ఉపయోగించే అవకాశం పెరిగింది. కృత్రిమ మేధస్సుతో తప్పుడు వీడియోలు, నకిలీ ప్రసంగాలు, ద్వేష ప్రచారాన్ని మరింత విశ్వసనీయంగా రూపొందించే సామర్థ్యం పెరుగుతోంది. భవిష్యత్తులో ఉగ్రవాదం కేవలం తుపాకులు, బాంబులతో మాత్రమే కాకుండా సమాచార యుద్ధం, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం రూపంలో కూడా వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

భారత్‌కు ఈ పరిస్థితి ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది. సరిహద్దు దాటి ప్రోత్సహించబడే ఉగ్రవాదం, జమ్మూ-కాశ్మీర్‌లో పరిస్థితులు, సరిహద్దు చొరబాట్లు, డ్రోన్‌ల ద్వారా ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంశాలు ఇప్పటికీ భద్రతాపరమైన ఆందోళనలుగానే ఉన్నాయి. అదే సమయంలో దేశీయంగా సామాజిక విభజనలు, మత విద్వేషాలు, ద్వేష ప్రచారం, ఆన్‌లైన్ తీవ్రవాదీకరణ వంటి అంశాలను కూడా నిర్లక్ష్యం చేయరాదు. ఉగ్రవాదం కేవలం సరిహద్దుల నుంచే వస్తుందని భావించడం నేటి పరిస్థితుల్లో సరైన దృక్పథం కాదు.

అంతర్జాతీయ సహకారం కూడా గతంతో పోలిస్తే మరింత కీలకంగా మారింది. ఉగ్రవాద నిధుల నియంత్రణ, సమాచార మార్పిడి, సైబర్ నిఘా, అంతర్జాతీయ నేర ముఠాలపై సంయుక్త చర్యలు లేకుండా ఏ దేశమూ ఒంటరిగా ఈ ముప్పును ఎదుర్కోలేదు. ఉగ్రవాదానికి ఆర్థిక వనరులు, ఆయుధాల సరఫరా, డిజిటల్ మౌలిక వసతులను అడ్డుకోవడం కూడా సైనిక చర్యలంతే ముఖ్యమైన అంశంగా మారింది. అయితే భద్రత పేరుతో ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడం కూడా ప్రమాదకరమే. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం చట్టబద్ధంగా, పారదర్శకంగా, మానవ హక్కులను గౌరవించే విధంగా సాగాలి. లేకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అదే తీవ్రవాద సంస్థలకు కొత్త నియామకాల అవకాశాన్ని కల్పిస్తుంది. భద్రతా చర్యలు, ప్రజాస్వామ్య విలువలు రెండూ సమతుల్యంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సైనిక శక్తి ఒక్కటే పరిష్కారం కాదు. నిరుద్యోగం, పేదరికం, విద్యా లోపం, సామాజిక వివక్ష, రాజకీయ అస్థిరత, విద్వేష ప్రచారం వంటి మూలకారణాలను కూడా పరిష్కరించాలి. యువతలో విమర్శనాత్మక ఆలోచన, డిజిటల్ అక్షరాస్యత, శాంతి విలువలపై అవగాహన పెంపొందించడం దీర్ఘకాలిక భద్రతకు అవసరం.

గణాంకాలు పాలకులకు, పరిశోధకులకు ఉపయోగకరమైన సాధనాలు మాత్రమే; అవే సంపూర్ణ సత్యం కావు. కొన్ని ప్రాంతాల్లో దాడులు తగ్గడం ఒక సానుకూల పరిణామమే అయినప్పటికీ, అదే సమయంలో ఉగ్రవాదం తన రూపాన్ని మార్చుకుంటూ కొత్త రంగాల్లోకి ప్రవేశిస్తోంది. అందువల్ల విజయాన్ని కేవలం మరణాల సంఖ్యతో లేదా దాడుల సంఖ్యతో కొలవలేం. సమాజంలో భయం తగ్గిందా? తీవ్రవాద భావజాలం బలహీనపడిందా? యువతను అతివాద ప్రచారం నుంచి రక్షించగలుగుతున్నామా? సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం కాకుండా అడ్డుకుంటున్నామా? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు.

అందుకే ప్రపంచం ఈరోజు నేర్చుకోవాల్సిన ప్రధాన పాఠం ఒక్కటే...ఉగ్రవాదం కనిపించే రూపం తగ్గిందని, అది అంతరించిపోయిందని అనుకోవడం అత్యంత ప్రమాదకరమైన భ్రమ. గణాంకాల వెనుక దాగి ఉన్న కొత్త ముప్పులను ముందుగానే గుర్తించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అంతర్జాతీయ సహకారంతో, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలతో, సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తూ ముందుకు సాగినప్పుడే నిజమైన భద్రత సాధ్యమవుతుంది.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం



**జనసైన్యం సిటి**
తిమ్మాపూర్ మండలం, రేణికుంట, గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలపై ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా ఉండాలని సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలోని దేవతలకు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం, వరదపాశం పోసే కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు దేవతలకు జాలాభిషేకం చేసి, వర్షాలు రావాలని ప్రజలు సుభిక్షం, ఉండాలని వ్యవసాయాభివృద్ధి కోరుకుంటున్నారు అనంతరం గ్రామ ప్రజలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలుక అంజనేయులు,మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ కోరేపు లింగారెడ్డి, ఉప సర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు బోయిని శంకరయ్య,తాళ్లపెల్లి శ్రీనివాస్, కొర్రి వంశీ,బావండ్ల ప్రవీణ్, గోనెల లక్ష్మి-సది,బోయిని సంగీత-సతీష్,బోయిని లావణ్య-సతీష్,కనపర్తి చంద్రశేఖర్, జూఖిఎం డైరెక్టర్ తమ్మన్నావేణి రాములు మాజీ కోప్షన్ సభ్యురాలు బీరం మహేశ్వరి, ఆలయ చైర్మన్ రొండ్ల రాజేశ్వర్ రెడ్డి,నాయకులు బొమ్మగాని నారాయణ,గొల్లపెల్లి మల్లేశం, చక్రం ఎల్లయ్య, బుర్ర అంజయ్య, యట రమణారెడ్డి గుర్రాల మధు, చందా వీరేశం, కాల్వ కనుకయ్య పోతుగంటి గణేష్,గ్రామ పెద్దలు రైతులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అత్యపత్య క్రీడల్లో హోరాహోరీ పోటీలు



**జనసైన్యం సిటి**
ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడమే అసోసియేషన్ లక్ష్యం.అత్యపత్య క్రీడల పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు అపూర్వ ప్రతిభను కనబరుస్తూ హోరాహోరీగా తలపడుతున్నారు. ప్రతి మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలతో ఆటగాళ్లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.ఈ సందర్భంగా అత్యపత్య అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముకేష్ ఈగల జిల్లా చైర్మన్ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ తో కలసి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించడమే అత్యపత్య అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తయారు చేయడానికి ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని, భవిష్యత్తులో మరిన్ని శిక్షణా శిబిరాలు, టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని ఆయన వెల్లడించారు.పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడిని అభినందిస్తూ, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని అసోసియేషన్ పిలుపునిచ్చింది.క్వార్టర్ ఫైనల్ కు చేరుకున్న జట్లు బాలుర నుండి రంగారెడ్డి, భద్రాద్రికొత్తగూడెం, జగిత్యాల్, హైద్రాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, మెదక్, మంచిర్యాల్ బాలికల నుండి మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వరంగల్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాలు చేరుకున్నాయి.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బుస్స మహేష్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, రాజు, కనకరెడ్డి, రజిత, రజినీ, సంతోషిని, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మాస శివరాత్రి సందర్భంగా కొడిమ్యాలలో ఘనంగా మహా అన్నప్రసాద వితరణ



**కొడిమ్యాల, (జన సైన్యం న్యూస్)**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గుండ్రప్ప శివాలయం, ఊళ్ల పోచమ్మ సమీపంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గుండ్రప్ప శివాలయంలో ప్రధాన అర్చకులు దెందుకూరి భాస్కర్ పంతులు వేదమంత్రోచ్చారణల నడుమ పరమేశ్వరునికి పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, అన్నపూజ నిర్వహించారు. అనంతరం శ్రీ హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా శ్రీ హనుమాన్ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణకు భక్తులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తుల రాకపోకలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా హనుమాన్ సేవ సమితి సభ్యులు మాట్లాడుతూ, ప్రతి మాస శివరాత్రి సందర్భంగా మండల ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యక్రమం విజయవంతం కావడానికి ధన, వస్తు, శ్రమ రూపేణ సహకారం అందించిన దాతలకు, గ్రామ ప్రజలకు, మహిళలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దెందుకూరి భాస్కర్ పంతులు, శ్రీ హనుమాన్ సేవ సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని "జై శ్రీరామ్", "జై హనుమాన్" నామస్మరణలతో ఆలయ పరిసరాలను భక్తిమయం చేశారు.

# తమ ఓటు ఉండాలంటే ఎస్ఐఆర్ చేసుకోవాల్సిందే

**జనసైన్యం సిటి**



కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు మరియు సవరణల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలను (హెల్ప్ డెస్క్‌లను) ఏర్పాటు చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నగరంలో నీ చింతకుంటలో ni శాంతినగర్ చౌరస్తా వద్ద బి.అర్.ఎస్ ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్ (ప్రత్యేక ఓటర్ సవరణ) సహాయ కేంద్రాలను మాజీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతి నాయక్ లతో కలిసి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ...ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయడమే వీటి ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం మరియు బి.ఎల్.ఓ ల సమన్వయ లోపం వల్ల నగరంలో ఇప్పటివరకు కేవలం 14 శాతం మాత్రమే ఓటరు సవరణ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. జూలై 24 లోపు మిగిలిన ప్రక్రియను ముగించాల్సి ఉందని... ఆన్‌లైన్ సర్వర్లు సరిగ్గా పనిచేయక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ స్వయంగా రంగంలోకి దిగి, 10 కేంద్రాల ద్వారా ప్రజలకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను పూర్తి చేసేందుకు ఉచిత సేవలు అందిస్తోందని... ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలి అని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో.. మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతి నాయక్ 14 డివిజన్ కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ కుమార్, మాజీ కొత్తపెల్లి మండల యూత్ అధ్యక్షులు గుర్రాల జయప్రకాశ్ రెడ్డి మైనార్టీ విభాగం మండల అధ్యక్షులు సయ్యద్ చాంద్ పాషా బిఆర్ఎస్ పార్టీ బి ఎల్ ఓ లు నజీమా బేగం సోమిరెడ్డి లచ్చిరెడ్డి కమల్ గౌడ్ శశిధర్ కిట్టు బెజ్జంకి సంపత్ నాగరాజు పరశురాములు వంకాయల రాజు శ్రీనివాస్ రెడ్డి చిట్టి పెల్లి నరేందర్ సయ్యద్ అన్వర్ పాషా సలీం సుజాత రవినేతి రవివర్మ, మిడి దొడ్డి నవీన్,పబ్బతి శ్రీనివాస్ రెడ్డి,. ఆయా డివిజన్ల కు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్



**జనసైన్యం సిటి**
నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 1వ డివిజన్ హనుమాన్ నగర్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద 12.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని తెలిపారు.ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి కొనసాగుతుందని మేయర్ అన్నారు. అనంతరం స్థానిక ప్రజలు తమ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి భారీ అపర్ణ జితేందర్,26 వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ,ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అలుగునూరులో133,134 పోలింగ్ బూత్ లలో ముమ్మరంగా ఓటర్ల నమోదు

**జనసైన్యం సిటి**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు పరిధిలోని పోలింగ్ బూత్ 133, 134లలో ఓటర్ల నమోదు( ఎస్ ఐ ఆర్) ప్రక్రియ శరవేగంగా, పకడ్బందీగా కొనసాగుతుంది. ఆదివారం రోజున ఈ నమోదు ప్రక్రియను బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సదరు పోలింగ్ బూత్‌ల (శక్తి కేంద్రం) ఇన్‌ఛార్జి బొంతల కళ్యాణ్ చంద్ర స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ పోలింగ్ బూత్ 133 లో71 శాతం, 134 లో 79 శాతం నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. బిఎల్ఓ అధికారులు గౌరీ , లత లు మ్యాపింగ్ , ఓటర్ నమోదు వివరాలను విజయవంతంగా పూర్తి చేయడానికి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో బిఎల్ఓలు చూపుతున్న చొరవను, ఎన్నికల అధికారుల సమన్వయాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే, ఈ ప్రక్రియకు సహకరిస్తున్న స్థానిక ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా బాధ్యతాయుతంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బూత్ లెవల్ అధికారులతో పాటు పౌర సమాజం కూడా ఇందులో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.ఇప్పటివరకు ఓటు హక్కు నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉంటే, వెంటనే సంబంధిత బిఎల్ఓలను సంప్రదించి, దరఖాస్తు ఫారాలను అందజేయాలని ఆయన సూచించారు.



## రుద్రారం గ్రామం రామడుగు మండలంలో గృహ నిర్బంధం



**జనసైన్యం సిటి**
కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, రుద్రారం గ్రామానికి చెందిన మెరుగు పద్మ, ఇంటి నెంబర్ 1-90/1 నివాసి కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్న ఇంటి దారికి అడ్డంగా చెట్ల పొదలను వేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ జిల్లా అధికారులను కోరారు. తక్షణమే దారికి అడ్డంగా ఉన్న నరికేసిన చెట్లను తొలగించాలని అధికారులను కోరారు. మెరుగు పద్మ తెలిపిన వివరాల ప్రకారం, గ్రామ కంఠం భూమిలో సుమారు 20 సంవత్సరాల క్రితం నుండి ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నారూ, మెరుగు పద్మ ఇంటికి వెళ్లేందుకు అప్పటి నుండి ఉపయోగిస్తున్న దారిని కొంతమంది కావాలనే అడ్డుకుంటున్నారని తెలిపారు.నాగం సుదర్శన్, నాగం సుధాకర్ మరియు మరికొంత మంది వ్యక్తులు తన ఇంటికి వెళ్లే దారిలో ఉన్న చెట్లను నరికి అడ్డంగా వేసి, తనను మరియు తన కుటుంబ సభ్యులను బయటకు వెళ్లకుండా గృహ నిర్బంధానికి గురి చేశారని ఆరోపించారు.దీంతో తన కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, మహిళలు, పిల్లల భద్రతపై ఆందోళన నెలకొందని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని మెరుగు పద్మ ప్రభుత్వ అధికారులను కోరారు.ఈ ఘటనపై రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని తిప్పరపు సురేష్ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకటన ద్వారా డిమాండ్ చేస్తున్నారు.

## మిడ్ మానేర్ నుండి వెంటనే నీటిని విడుదల చేయాలి



**జనసైన్యం సిటి**
మీద మిడ్ మానేర్... కింద లోయర్ మానేరు జలాశయాలు నీళ్లకు మాత్రం కరువు..మిడ్ మానేర్ నుండి వెంటనే నీటిని విడుదల చేయాలి.సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్.పొత్తూరు గ్రామంలో రైతులు అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్నారు. నాట్లు వేసే సమయం రావడంతో కనీసం నారుమడులకు కూడా నీళ్లు లేక పొత్తూరు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూత వేటు దూరంలో మిడ్ మానేరు జలాశయం ఉన్నా కూడా పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు చెప్పిన కూడా కనీసం రైతుల మందం కూడా నీళ్లు విడుదల చేస్తలేరు. ఈరోజు కొంతమంది రైతులు వాగులో ఉన్న కొద్దిపాటి నీళ్లను బోర్ల వద్దకు జెసిబి సాయంతో తీసుకు వెళ్తున్న దృశ్యం చూస్తే నీటీ కోసం ఎంత బాధపడుతున్నారో అర్థం చేసుకొని ఉన్నతాధికారులు నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో మిడు మానేర్ రిజర్వాయర్ పైన రైతులతో కలిసి ఆందోళన చేస్తామని సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్ తెలిపారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితో 42వ డివిజన్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు



**జనసైన్యం సిటి**
పనులను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు.
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్ భగత్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 'ఓపెన్ జిమ్' పనులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో, సీఎస్ఆర్ (CSR - కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ ద్వారా కరీంనగర్ నగరానికి మొత్తం 18 ఓపెన్ జిమ్‌లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగానే 42వ డివిజన్‌లో ఈ అధునాతన ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే సదుద్దేశంతోనే ఈ జిమ్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సునీల్ రావు తెలిపారు. యువత, ప్రజలు ఫిట్‌నెస్ కోసం ప్రైవేట్ జిమ్‌లకు వెళ్లి డబ్బులు వెచ్చించాల్సిన అవసరం లేకుండా, ఉచితంగా ఈ సేవలను వినియోగించుకునేలా వీటిని డిజైన్ చేశామన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వచ్చే వారికి, ఇతర ప్రజలందరికీ ఈ జిమ్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.అతి త్వరలోనే ఈ ఓపెన్ జిమ్ పనులను పూర్తి చేసి, 42వ డివిజన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని యాదగిరి సునీల్ రావు స్పష్టం చేశారు.

## కొలువుల కొట్లాటకై వేలాదిగా తరలిరండి

**జనసైన్యం సిటి**




కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదివారం రోజున సిపిఎం జిల్లా కార్యాలయం ముకుంద లాల్ మిశ్రాభవన్లో మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల్లో లక్షల్లో కొలువులు ఖాళీగా ఉన్నాయని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన పాలకులు పకోడీలు బజ్జీలు వేయడం కూడా ఉద్యోగాలే అంటూ వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమైన వైఖరి అన్నారు. పార్లమెంటులో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం కేంద్ర మంత్రిత్వ శాఖలో దాదాపు 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎం, లతోపాటు ట్రిబుల్ ఐటీలు, నీట్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇతర ఉన్నత విద్యా సంస్థలు కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో దాదాపు 37వేల ఉద్యోగాలు భర్తీకి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ సెక్టార్కు అప్పగిస్తూ ఉద్యోగాలను కుదించేస్తుందన్నారు

కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యూత్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు.

స్వయంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ హైదరాబాదులో నిరుద్యోగులతో మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయి అని భరోసా ఇచ్చారన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు గడుస్తున్న కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందన్నారు. ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా నోటిఫికేషన్లు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 20వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 7000 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ,హాస్టల్లో మగ్గుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వమ్ము చేస్తుందన్నారు. నోటిఫికేషన్ రాక భవిష్యత్తుకు భరోసా లేక ఈ ప్రభుత్వంలో కూడా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 9000 మంది పదవీ విరమణ పొందుతున్నారని,ఈ విధంగా రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువకులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. స్వయం ఉపాధి రుణాలకు నిధులు మంజూరు చేయకుండా దరఖాస్తులు స్వీకరించి రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని కేంద్ర బీజేపీ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ, జెఎల్, డిఎల్, గ్రూప్ 1 2 3 4 తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నెలకు 5000 నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఎలాంటి వివాదాలు కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవోలను తొలగించి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ను యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు అన్నిటిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 15న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నాలో యువకులు, నిరుద్యోగులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, జి రాజేశం, నాయకులు రాయి కంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, మాతంగి శంకర్, చల్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఫిజియోథెరపీ కేంద్రం ప్రారంభం



**జనసైన్యం సిటి**

ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాల పునరావాస వైద్య సేవలు అందించేందుకు కరీంనగర్‌లోని పవన్ పద్మ హాస్పిటల్లో అత్యాధునిక పరికరాలతో అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ సెంటర్ను ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ ఆదివారం ప్రారంభించారు. అనుభవజ్ఞులైన ఫిజియోథెరపిస్టుల పర్యవేక్షణలో ప్రతి రోగికి వ్యక్తిగత చికిత్సా ప్రణాళికతో నాణ్యమైన సేవలు ఆస్పత్రి యజమాన్యం అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, శస్త్రచికిత్సల తర్వాత త్వరగా కోలుకోవడంలో ఫిజియోథెరపీ సహాయపడుతుంది. అదే మాదిరిగా పక్షవాతం, నరాల సమస్యల వల్ల తగ్గిన కదలికలను మెడ, నడుము, భుజం, మోకాళ్ల నొప్పులను తగ్గిస్తుందని అన్నారు. ముఖ్యంగా క్రీడాకారుల గాయాల నుంచి వేగంగా కోలుకోవడానికి తోడ్పడుతుందని అన్నారు. దీర్ఘకాలిక నొప్పులను కూడా తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు.ఈ కేంద్రం ద్వారా కరీంనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునిక పునరావాస సేవలు అందుబాటులోకి వస్తాయని ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ పవన్ డాక్టర్ పద్మ మరియు డాక్టర్ ఎన్ నిఖిల్ డాక్టర్ ఎన్ శిల్ప తదితరులు తెలిపినారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



కొడిమ్యాల,(జన సైన్యం న్యూస్)

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి.కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవూరి నాగభూషణ్ రెడ్డి,కొడిమ్యాల ఫ్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కడారి మల్లేశం,స్థానిక సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, ఉప సర్పంచ్ గుర్రం నరసయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు రాజేష్,నేరెళ్ల మహేష్ బండ శ్రీనివాస్ రెడ్డి, గుడి మల్లికార్జున్ రెడ్డి.పర్లపల్లి ప్రసాద్,యువజన కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్,గాజుల అజయ్ మేకల మల్లేశం, హనుమండ్ల అజయ్ రెడ్డి గోల్కొండ రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నందిని కాన్వెంట్ , వాల్మీకి విద్యాలయంలో స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం







**జనసైన్యం సిటి**

కరీంనగర్ జిల్లాలో విద్యాప్రమాణాలతో అగ్రస్థానంలో నిలిచిన నందిని కాన్వెంట్ ఌ వాల్మీకి విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఖశ్రీవత్ ూఎష్ట్రశీశ్రీఘతీంష్ట్రఱఋజూ ుఎవర్-2026 కు దాదాపు 150 ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుండి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఈ పరీక్షలో 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు విజేతలుగా నిలిచిన 30 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈరోజు ఉదయం 10.30 గంటలకు ఘనంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.పాఠశాలల దార్శనిక చైర్మన్, విద్యావేత్త శ్రీ యాదగిరి శేఖర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బార్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీ ఏర్రం రాజారెడ్డి , ఏకలవ్య చైర్మన్ శ్రీ నరసింహ రావు మరియు శ్రీ పచ్చునూరి సురేందర్ విచ్చేసి విజేతలను అభినందించి నగదు బహుమతులతో సత్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ, "విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే మా లక్ష్యం. అందుకే ప్రతి ఏడాది ఈ ూఎష్ట్రశీశ్రీఘతీంష్ట్రఱఋజూ ుఎవర్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. నందిని ఌ వాల్మీకి విద్యాలయం కరీంనగర్ లో నాణ్యమైన విద్యతో పాటు రోబోటిక్స్, అబాకస్, IIT Foundation, NEET Coaching, ఒలింపియాడ్ మరియు శాటిలైట్ క్లాసులు అందించే ప్రముఖ విద్యాసంస్థ. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ఉపయోగపడే ఆధునిక కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నాం" అని ప్రకటించారు. చైర్మన్ నిర్ణయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బహుమతుల వివరాలు:

- 1st Prizవ: ? 5,000/-
- 2nd Prize: ? 3,000/-
- 3rd Prize: ? 2,000/-

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ముఖ్య అతిథులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నటనకు 'కోటలు' కట్టిన కోట శ్రీనివాస రావు

**(13 జూలై ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా)**

**డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి**



10 జూలై 1942న ఆంధ్ర ప్రదేశ్‌లోని కంకిపాడు గ్రామంలో జన్మించారు. కోట శ్రీనివాసరావును వైద్యుడిని చేయాలని తలిచిన తండ్రి ప్రముఖ వైద్యులు సీతారామాంజనేయులు ఆకాంక్షకు వ్యతిరేకంగా నటనలో మక్కువతో కళాశాల జీవితంలోనే నాటకాల్లో పలు పాత్రలను వేయడం, ప్రేక్షకులను మెప్పించడంతో నటననే వృత్తిగా మార్చుకోవడం జరిగింది. బి. ఎస్సీ. పూర్తి చేసిన పిదప నాటకాలు ఆడుతూనే స్టేట్ బ్యాంక్ ఉద్యోగిగా సేవలు అందించారు. రుక్మిణిని వివాహమాడిన కోట శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తన సోదరుడు కోట శంకర్రావు కూడా సినీ నటుడిగానే పేరు తెచ్చుకున్నారు. తన 83వ ఏట 13 జూలై 2025న వేకువ జామున హైదరాబాదులో తుది శ్వాస విడిచారు.

**750కి పైగా సినిమాల ఘన చరిత్ర:**

1978లో క్రాంతి కుమార్ నిర్మించిన "ప్రాణం ఖరీదు" అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసి మొత్తంగా తెలుగు, కన్నడ, తమిళ, మళయాలీ, హిందీ సినిమాల్లో కలుపుకొని దాదాపు 750కి పైగా సినిమాల్లో నటించిన కోట శ్రీనివాసరావు అసమాన ప్రతిభను ప్రదర్శించిన కోట వారు తెలుగు నాటక రంగాన్ని కూడా సుసంపన్నం చేశారు. రాజకీయ నాయకుడిగా 1999 – 2004 మధ్య ఎంఎల్ఏగా కూడా ప్రజా సేవ చేసిన కోట సినీ నటుడిగా ప్రతినాయకుడు, క్యారెక్టర్ నటుడు, హాస్య, సహాయ నటుడిగా తన సత్తా చాటుకొని తొమ్మిది రాష్ట్ర నంది అవార్డులు, అల్లు రామలింగయ్య పురస్కారం, సైమీ అవార్డులతో పాటు 2015లో భారత ప్రభుత్వం చేత పద్మశ్రీ పురస్కారం కూడా పొందారు.



**పాత్ర ఏదైనా, ప్రతిభ అనన్య సామాన్యమే :**

నటనకు జీవం పోశారు. అసమాన ప్రతిభను తెరపై పండించారు. కోట శ్రీనివాస్ రావు నటనకు పెట్టింది పేరు. కరుడుగట్టిన విలన్, తండ్రి, హాస్య నటన, తాత, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఏ పాత్రలోనైనా అవలీలగా ఒదిగిపోయే ప్రతిభ ఆయనకే సొంతం. నటనకు కోట్లు కట్టిన కోట శ్రీనివాస్ రావు కుమారుడు కోట వెంకట ఆంజనేయులు 2010లో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో మానసికంగా కుంగి పోయారు. తాను నటించిన వందల సినిమాల్లో అనగనగా ఒక రోజు, మామ , బొమ్మరిల్లు, ఛత్రపతి, రెడీ, ఆ నలుగురు, ఆమె, హలో బ్రదర్, గాయం, శివ, ప్రతిఘటన, అర నా పెళ్లంటా, గణేష్, మల్లీశ్వరి, అతడు, అత్తారింటికి దారేది, సన్ ఆఫ్ సత్యమూర్తి, రక్త చరిత్ర, రేపటి పౌరులు లాంటి అనేక సినిమాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు సహితం పొందారు. అర నా పెళ్లంటా సినిమాలో పిసినారి ప్రతినాయక ప్రాత్రలోనైనా, మామ గారు సినిమాలో హాస్య నటుడి పాత్రలోనైనా, యోగి సినిమాలో విలన్ పాత్రలోనైనా, గబ్బర్ సింగ్ సినిమాలో క్యారెక్టర్ పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతూ ప్రేక్షక లోకం అభిమానాన్ని చూరగొన్నారు.

అలనాటి రంగారావు, నాటి సత్యనారాయణ లాంటి ప్రతి నాయకులకు ప్రత్యామ్నాయంగా విలన్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిపోయారు. నటనకు కోట్లు కట్టిన కోట, నేటి తరం నటులకు మార్గ నిర్దేశనం చేస్తూ, తన అద్భుత ప్రతిభ నటులకు పాఠాలుగా మారాలని, వారి ఆత్మ శాంతికి ప్రార్థనలు చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేద్దాం.